క్లుప్తంగా

దేవరకొండపై కార్తీక దీపోత్సవం రేపు

బంగారుపాళెం: మండలంలో మొగిలి శివాలయానికి అనుబంధంగా ఉండే దేవరకొండపై శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు తెలిపారు. దేవరకొండపై స్వయంభుగా వెలసిన శ్రీపార్వతీ సమేత జలకంఠేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం కొండపై గల బురుజుపై శాస్త్రోక్తంగా కార్తీక దీపోత్సవాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాత్రి ఆలయ ఆవరణలో శివకోటి భజనలు ఉంటాయని ఆయన వివరించారు. భక్తులకు అన్నదానం చేయనున్నామన్నారు. కార్తీక దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ జలకంఠేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న డీఈలు ప్రసాద్, ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈలు ప్రసాద్, ఆనంద్ తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సంతపేటలో చెట్లకు తీగలు తగలకుండా సైడ్‌హారం ఏర్పాటు చేయాలని, రెడ్డిగుంట సెక్షన్ పరిధిలో వ్యవసాయ సర్వీసులకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విన్నవించారు. కొంగారెడ్డిపల్లె పరిధిలో మీటర్ పేరు మార్పు, గుడిపాల పరిధిలో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయాలని మొత్తం 5 ఫిర్యాదులు వచ్చిందని డీఈలు పేర్కొన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది ఆదేశించారు.

పూర్వపు కమిషనర్ అరుణపై విచారణకు ఆదేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో కమిషనర్‌గా పనిచేసిన అరుణపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇక్కడ పనిచేసిన కాలంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో వీటిపై విచారణకు ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏపీయూఎస్ఐడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్ర బియానీని విచారణ అధికారిగా నియమించారు. త్వరలో ఆయన చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు.

దుకాణాల అద్దె చెల్లించకుంటే చర్యలు


దుకాణ నిర్వాహకులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ ప్రసాద్, అధికారులు

చిత్తూరు అర్బన్: మునిసిపాలిటీకి చెందిన దుకాణాలకు సకాలంలో అద్దెలు చెల్లించకుంటే చర్యలు తప్పవని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ హెచ్చరించారు. నగరంలోని పలు మునిసిపల్ వాణిజ్య సముదాయాలను, కూరగాయల మార్కెట్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మార్కెట్ల నుంచి నిర్ణీత గేటు రుసుమును తప్పనిసరిగా చెల్లించాలన్నారు. అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు గోపాలకృష్ణవర్మ, ఉమామహేశ్వర్ రెడ్డి, దొర్రై, పలువురు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

- ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్


ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్

పుంగనూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహమ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీలు శ్రీనివాసులు, నరేంద్ర, చిన్నబ్బ తో కలసి విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, విద్యుత్ బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే ఎలాంటి విద్యుత్ సమస్యలు ఎదురైనా తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. తీవ్రమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే వర్షాకాలం కావడంతో విద్యుత్ అంతరాయంతో పాటు లైన్లు పడిపోవడం, షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉందన్నారు. వీటిని నియంత్రించేందుకు ప్రతి ప్రాంతంలోను ఏఈలు, లైన్‌మెన్లు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.. అలాగే సబ్ స్టేషన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

సాగునీటి సమరం.. సక్రమంగా సాగేనా.?

- ఈ నెల 14న నీటి సంఘం ఎన్నికలు
- చిత్తూరు నియోజకవర్గంలో 13, పూతలపట్టులో 40 చెరువులకు ఎన్నికలు
- సమాయత్తమవుతున్న అధికారులు
- ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీ కుయుక్తులు


గుడిపాల: ఎన్నికల నోటిఫికేషన్ ఉత్తర్వులను నోటీసుబోర్డులో అతికించిన అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గత నెల 21న జరగాల్సిన ఈ ఎన్నికలు ఈ నెల 14వ తేదీకి వాయిదా పడడంతో ఆశావహులు ఆ పదవులు దక్కించుకునేందుకు తహతహలాడిపోతున్నారు. నోటిఫికేషన్ జారీ చేసి అధికారులు ఎన్నికల నిర్వహణకు సమాయత్తమయ్యారు. పకడ్బందీగా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టారు. సుమారు పదేళ్ల తర్వాత ఈ ఎన్నికలు జరుగుతుండడంతో, ఏకగ్రీవం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. అలా కుదరకపోతే తమ అనుకూలమైన వ్యక్తులను గెలిపించేందుకు కూటమి నాయకులు కొన్ని చోట్ల ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ నెల 14న ఎన్నికలు

నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ బుధవారం వచ్చింది. 14న ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. రైతు భరోసా రూ.20వేలు ఇస్తామని చెప్పిన మాట తప్పింది. ఈ ఖరీఫ్‌లో కనీసం పెట్టుబడి సాయం కూడా రైతులకు ఇవ్వలేదు. అంతేకాకుండా ఎరువులు, పురుగుమందుల ధరలు అమాంతం పెంచేసి ఖరీఫ్‌లో రైతులను నానా అవస్థలకు గురి చేసింది. ఈ ఎన్నికలతో రైతులకు ఒరిగింది ఏమి లేదని పలువురు రైతులు చెబుతున్నారు. కేవలం పదవి కోసం పాకులాడాల్సిందే తప్ప ప్రయోజనం లేదని అంటున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 13, పూతలపట్టు నియోజకవర్గాల్లో 40 చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ చెరువు ఆయకట్టు కింద రైతులు సుమారు 2 వేల మంది ఉండవచ్చని అధికారులు అంటున్నారు. వారిని ఏకతాటిపైకి తెచ్చి ప్రత్యక్ష పద్ధతి నీటి సంఘాలను సజావుగా నిర్వహించేందుకు ఇరిగేషన్, మండల స్థాయి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల, సచివాలయాల్లో ఎన్నికలు నిర్వహించేలా చూస్తున్నారు.

ఏకగ్రీవం కోసం పట్టు

రెండు నియోజకవర్గాల్లోనూ 90 శాతం చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. 10 శాతం మాత్రమే ఎన్నికలు జరిగేలా ఉన్నాయని అధికారులకు సమాచారం. చిత్తూరు మండలం దిగువమాసాపల్లి చెరువుకు గతంలో నువ్వా నేనా అంటూ పోటీ పడ్డారు. ఈ సారి కూడా ఈ చెరువుకు తీవ్ర పోటీ ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. గుడిపాలలో చెరువులకు ఎన్నికలు జరిగితే కరువు వస్తుందని సెంటిమెంట్‌గా ఫీలవుతున్నారు. ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో మాత్రం నీటి సంఘాల ఎన్నికలు కొన్ని చోట్ల పోటీ జరగవచ్చని, చాలా చోట్ల ఏకగ్రీవానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ చెరువులన్నీ కూడా చేపల పెంపకానికి అనువుగా ఉన్నట్లు చెబుతున్నారు. పట్టుకోసం అప్పుడే మండల నాయకుల వద్దకు సిఫార్సులు మొదలయ్యాయి.

ఈ చెరువులకే ఎన్నికలు

53 చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి.
చిత్తూరు పరిధిలోని చెర్లోపల్లి బ్రహ్మణ చెరువు,
తేనెబండలోని కోగిల్ చెరువు,
మంగసముద్రం చెరువు,
ఇరువారంలోని జెడియం చెరువు,
దిగువమాసాపల్లి చెరువు,
పచ్చనపల్లి అరతల చెరువు,
కుర్చివేడు చెరువు,

గుడిపాల మండలం

పానాటూరు ఓం మాసవయ్య చెరువు,
నంగమంగళం చెరువు,
వసంతాపురం బంగారక్క చెరువు,
బొమ్మసముద్రం బొమ్మినాయని చెరువు,
పాప సముద్రం రామిరెడ్డి చెరువు,
నారగల్లు చెరువు

పూతలపట్టు నియోజకవర్గం

బంగారుపాళ్యం మండలం

మొగిలిగాని చెరువు,
బలిజపల్లెలోని చీకల చెరువు,
కామాక్షమ్మ చెరువు,
జంభూవారిపల్లి వెంకటప్పనాయని చెరువు,
మహా సముద్రం చెరువు,
170 గొల్లపల్లి వీరప్పనాయని చెరువు,
తుంబకుప్పం కొత్తచెరువు,

ఐరాల మండలం

కాణిపాకం పిళ్లారి చెరువు,
బొమ్మసముద్రం చెరువు,
ఎం.పైపల్లి చిన్నరాయని చెరువు,
పుత్రమది వీర రాఘవరెడ్డి చెరువు,
పుల్లూరు నేరేడు చెరువు,
మొరంపల్లి కొంగుంట చెరువు,
దివిటివారిపల్లి అమ్మ చెరువు,
ఐరాల జీరప్ప చెరువు,
పాలకలలోని చిన్నరెడ్డిచెరువు,
వేల్‌రెడ్డిచెరువు,
కొత్త చెరువు,
పి.ఎల్లంపల్లి పల్లిపట్టి దిగువ చెన్నమ్మ చెరువు,
గుండ్లపల్లి రెడ్డి చెరువు,
చుక్కలవారిపల్లి చెరువు

పూతలపట్టు మండలం

పోలవరం రామసముద్రం చెరువు,
పోతినేని చెరువు,
వావిల్‌తోట తాటి చెరువు,
పి.కొత్తకోట రెడ్డిచెరువు,
ఆకనంబట్టు పెద్దనాయని చెరువు,
పాటూరు వెంగమునిరెడ్డి చెరువు,
తిమ్మిరెడ్డిపల్లి పెద్ద చెరువు,
పాలకూరు పెద్ద చెరువు,
గొడుగుచింత తాటిచెరువు,
పోటుకనుమ దిగువపల్లి చెరువు,

తవణంపల్లి మండలం

పట్నం పెద్ద చెరువు,
పుణ్య సముద్రం చెరువు,
అరగొండ గాజులపల్లి చెరువు,
తొడతర కుయ్యవంక,
సరకల్లు రమణ చెరువు,
ముచ్చుకాలువ జీ.గొల్లపల్లి వంక,

యాదమరి మండలం

మాదిరెడ్డిపల్లి కుట్లవంక చెరువు,
కుక్కలపల్లి బాదం చెరువు,
భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టు

ఎండీయూ ఆపరేటర్ రాజీనామా

- కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం : డీఎస్ఓ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని చామంతిపురం చౌకదుకాణానికి సంబంధించిన ఎండీయూ ఆపరేటర్ రాజీనామా చేశారని, ప్రస్తుతం వీఆర్ఓ ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నామని డీఎస్ఓ శంకరన్ పేర్కొన్నారు. 'సాక్షి' దినపత్రికలో బుధవారం 'క్యూకట్టిన రేషన్ బ్యాగులు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించి డీఎస్ఓ విచారణ చేపట్టి ఎండీయూ ఆపరేటర్ రాజీనామా చేశారని వెల్లడించారు. అక్కడి బాధ్యతలను వీఆర్ఓకు అప్పగించామన్నారు. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ చేస్తామని డీఎస్ఓ పేర్కొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులకు తప్పని అగచాట్లు

రొంపిచెర్ల: ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడిన సంఘటన బుధవారం మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి లోని రొంపిచెర్ల మండలం బండకిందపల్లె సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతి నుంచి అన్నమ్మయ్య జిల్లా రాయచోటి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు రాయచోటికి వెళుతూ బండకిందపల్లె సమీపంలో మరమ్మతులకు గురై మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు పడిగాపులు కాసి మరో బస్సులో ఎక్కి వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల కాలంలో తరచూ జాతీయ రహదారిలో వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు మొరాయిస్తున్నాయి. ఈ కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నారు. కాలం చెల్లిన బస్సులను తిప్పడం వలనే ఇలా జరుగుతోందని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి కొత్త సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్


హ్యాకథాన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏఐసీటీఈ మెంబర్ రాములు

చిత్తూరు కలెక్టరేట్: ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రస్తుత అధునాతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఏఐసీటీఈ మెంబర్ రాములు అన్నారు. నగర సరిహద్దులో ఉన్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దైనందిన జీవితంలో ఎదురయ్యే కొన్ని ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడంలో విద్యార్థులను నిమగ్నం చేసేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమం అని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. హ్యాకథాన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న టెక్నికల్ విద్యార్థులు వారి వారి ఆలోచనలను ఇతరులతో పంచుకుంటున్నారని చెప్పారు. ఎస్వీ సెట్ ప్రిన్సిపల్ డా.మోహన్‌బాబు మాట్లాడుతూ ఏఐసీటీఈ అనుమతి ప్రక్రియలో ఏఐ ఆధారిత పోర్టల్ ఎంతో ఉపయోగమన్నారు. సమస్య, పరిష్కార సంస్కృతిని పెంపొందించేందుకు హ్యాకథాన్ మంచి ప్లాట్‌ఫార్మ్ అని అన్నారు. విద్యార్థులు నూతన టెక్నాలజీ నైపుణ్యాలను పెంచుకోవచ్చని చెప్పారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో నోడల్ సెంటర్ హెడ్ సౌరభ్, ఏఐసీటీఈ డిప్యూటీ డైరెక్టర్ వెంకట లక్ష్మి, డైరెక్టర్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న భూ రీసర్వే డీటీ వెంకటరమణ

తవణంపల్లె: గ్రామస్తులకు సౌకర్యంగా శ్మశానానికి సరిహద్దులు ఏర్పాటు చేయాలని ముట్టుకూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ముట్టుకూరులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ముట్టుకూరు గ్రామస్తులకు సంబంధించిన శ్మశానాన్ని సర్వే చేసి, సరిహద్దులు ఏర్పాటు చేయాలని, ముట్టుకూరు నుంచి రామానాయుడుపాళ్యం వరకు రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురై రాకపోకలకు ఇబ్బందిగా ఉందని రోడ్డును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని అర్జీ అందజేశారు. భూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, ఎంఆర్ఐ జీవన్‌సాగర్, సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్ఓలు, వీఆర్ఏలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లె వద్ద దుకాణాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

దుకాణాల తొలగింపు

బైరెడ్డిపల్లె: బెంగుళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా బైరెడ్డిపల్లె సమీపంలోని దుకాణాల తొలగింపు పనులకు బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి చర్యలు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా దుకాణాలకు పరిహారం చెల్లించినా ఖాళీ చేయకపోవడంతో పోలీస్ సిబ్బందితో చేరుకుని యంత్రాలతో వాటిని తొలగించారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా దుకాణాలు ధ్వంసం చేయడంతో బాధితులు లబోదిబోమన్నారు. నష్టపరిహారం విషయంలో కొంత మంది బాధితులు పరిహారం తీసుకోకుండా కోర్టును ఆశ్రయించారు. వారం రోజుల్లో పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని, రోడ్డు పనులకు సహకరించాలని జేసీ కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ భవాని, సీఐ మురళీమోహన్, తహసీల్దార్ మాధవరాజు, ఎస్ఐ పరుశురాముడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సంరక్షకులు రెవెన్యూ అధికారులే


నలగాంపల్లె గ్రామ సభలో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు

బంగారుపాళెం: రెవెన్యూ అధికారులే ప్రభుత్వ భూములకు ప్రధాన సంరక్షకులని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మండలంలోని నలగాంపల్లెలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ అర్జీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తోందన్నారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, నలగాంపల్లె గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై ప్రజల నుంచి 35 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల మెడపై సర్కారు కత్తి

- కర్షకులకు అందని పెట్టుబడి సాయం
- ఉచిత పంట బీమాకు మంగళం
- రేపు ప్రభుత్వ తీరుపై నిరసన
- తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పిలుపు


అన్నదాతకు అండగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కాణిపాకం: రైతుల మెడపై సర్కారు కత్తి పెట్టిందని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దుయ్యబట్టారు. కాణిపాకంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడిచిన ఆయన తనయుడు వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా వ్యవహరించారన్నారు. విత్తనం దగ్గర నుంచి ధాన్యం విక్రయం వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచిందని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయంగా రైతులకు అదునుకు ముందే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇచ్చిన పాపాన పోలేదని చెప్పారు. అన్నం పెట్టే రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం ఇప్పట్లో వారు కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టిందన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు.

అన్నదాతకు అండగా రేపు

జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉదయం 9 గంటలకు చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి 9.30 గంటలకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చి, వారికి న్యాయం జరిగేలా పోరాడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ కాణిపాకం సుధీర్, బొమ్మసముద్రం బాబు, నాయకులు చిన్నారెడ్డి, చరణ్‌రెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంపై చిన్నచూపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రంపై చిన్నచూపు చూస్తోంది. తద్వారా అందే సేవలను పక్కనపెట్టింది. ఎరువుల ఆర్డర్ బుకింగ్‌లు ఆగిపోయాయి. రైతులు ఎరువుల కోసం తమిళనాడు, చిత్తూరు ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. అసలు రైతు సేవలను పూర్తిగా గాలికి వదిలేసింది. సిబ్బంది అదనపు బాధ్యతల్లో మాత్రమే నిమగ్నమవుతున్నారు. రైతు సేవలపై చిన్న చూపు చూస్తున్నారు. రాయితీ విత్తనాలు అసలు కనిపించడం లేదు. దీంతో రైతులకు భరోసా కేంద్రాలకు మధ్య దూరం బాగా పెరిగింది.

పెట్టుబడి నిధికి పంగనామాలు?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి నిధిగా ఏటా రూ.13,500 అందించేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఈ నిసాయం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్న హామీ అమలుకు నోచుకోలేదు. రైతులు పెట్టుబడి సాయం లేక అష్టకష్టాలు పడుతున్నారు. పంట సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. అన్నదాతలు సాగు కోసం చేసిన రుణాలకు వడ్డీలు కట్టలేక దిగాలు చెందుతున్నారు. ఇలాంటి తరుణంలో అన్నదాత సుఖీభవ ఆదుకుంటుందా..లేదా అనే విషయం అగమ్యగోచరంగా ఉంది. పంట బీమాకు ధీమా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

బాలికల వికాసానికే శిక్షణ


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి

పెనుమూరు (కార్వేటినగరం): బాలికల వికాసం కోసమే కిశోర వికాసం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం కిశోరి వికాశంపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్, లెక్చరర్లను ఒక విలేజ్ రిసోర్స్ గ్రూపుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కిశోర బాలికలు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ, బాల్యవివాహాలను నిరోధించడానికి అందరూ దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ రాజేంద్రన్, డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కరాటేమాస్టర్ పరంధామయ్య ఆధ్వర్యంలో పెనుమూరులోని శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థినులు హర్షిత, గౌతమి, కిరణ్మయి, నిషిత చేసిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరాటేమాస్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో ఆడవారిపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవాలన్నా, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నా ప్రతి ఒక్క అమ్మాయి కరాటే నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చిరంజీవి, పీహెచ్ఎస్ ధనలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రేణుక, టీచర్లు పాల్గొన్నారు.


కరాటే శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్